# కన్పించడంలేదు

కన్పించడంలేదు. మావాడు కన్పించడంలేదు. అంటే నా తమ్ముడు. వాడు ఇల్లువిడిచి వెళ్ళిపోయి వారం రోజులైంది. ఇదివరలోకూడా మావాడు తరచు పారిపోతూ వుండేవాడు. మళ్ళా వాడే తిరిగొస్తూ వుండేవాడు. కాని ఇప్పుడు పారిపోవడం వల్ల ఒక ప్రమాదం వచ్చింది. అందుకే మానాన్న నా వద్దకు పరుగెత్తుకవచ్చి పత్రికలో 'కన్పించడంలేదు' అనే ప్రకటన యివ్వమన్నాడు.

అసలు నిజంచెప్పాలంటే మానాన్నే వాణ్ణిచెడగొట్టాడు. ఈ రోజులలో మగపిల్లలను నెత్తికెక్కించుకుంటే మాట వింటారండీ? మావాడు ముచ్చటగా మూడుసార్లు యస్. యస్. యల్. సి. పరీక్షల్లో బ్రహ్మాండంగా దండయాత్ర కొట్టాడు. మానాన్న మాట్లాటలేదు. ఎలాగో నాలుగవ పర్యాయం ప్యాసై కాలేజీలోచేరి ఇంటర్ చదివాడు. ప్రతిసారీ పోవడమే! అప్పుడుకూడా నాన్న కిమ్మనలేదు. 'పరీక్ష పోతే పోయిందిలే! ... పెద్దవాడు ఎలాగూ ఉద్యోగమని ఊళ్లు తిరుగుతున్నాడు: నువ్వయినా ఇంటి పట్టునవుండి వున్న పదెకరాల కొంద్రను కనిపెట్టుకొని వుండరా!' అని అనడంతో వాడికళ్లు మరీనెత్తికెక్కనాయి.

ఇంటిపట్టునవుండి వాడేనా పొలాన్ని కనిపెట్టుకొని వుండేది? పనంతా మళ్ళా ముసలాయనే చూసేవాడు! పదీ,

పరక డబ్బు చేతికిరావడం ఆలస్యం గుడివాడ పరుగెత్తి వున్న నాలుగు సినిమాలు చూసి రెండోరోజు మధ్యాహ్నానికి ఇంటికి చేరడం అలవాటు చేసుకున్నాడు.

వీడికేదో పెద్ద ఆదర్శాలున్నట్టు — 'పెళ్ళిరా' అని మానాన్న అంటే 'వద్దు నాన్నా! అప్పుడే నా కెందుకు పెళ్ళి'? అని నంగనాచి కబుర్లు చెబుతాడు. వీడి వేషాలు ఎవరికి తెలియవు? అందుకే వాడంటే మహాగారాబం! మరి చిన్నవాడు కదూ? ఇక మాఅమ్మవిషయం చెప్పనే అవసరంలేదు.

అసలు క్రిందటిసారి పారిపోయినప్పుడే నేను, నాన్నాను అమ్మను - వడ్డ డబ్బు వాణ్ణి తెమ్మని చెప్పడమేమిటని కోప్పడ్డాను. వాడు తిరిగొచ్చాడని తెలిసి వెళ్ళి 'ఏమిటిరా ఈపనులు చేతికి డబ్బు దొరికిందని ఇష్టంవచ్చిన చోటికెల్లావెళ్ళి జల్సా చేసివస్తే నలుగురూచూసి ఏమంటారో నీకు తెలుసునా? పైగా పెళ్లి కావలసినవాడివి! .... ' అని మందలించాను.

'వండర్‌ఫుల్' అన్నాడు వాడు. బొంబాయి నగరం అత్యద్భుతమైన దన్నాడు. 'మెరీన్‌డ్రైవ్' అన్నాడు. 'హేంగింగ్ గార్డెన్స్' అన్నాడు. 'మలబార్ హిల్స్' అన్నాడు. 'ఇండియా గేట్' అన్నాడు. ఏదేదో చెప్పి చివరకు నాకోసం బొంబాయిలో వాడు తెచ్చిన 'ఫులెన్ సూటింగ్' నా ముందుంచాడు. ఇక వాణ్ణి నేనేమనాలి? ఐదొందల రూపాయలు ఖర్చు పెట్టుక వచ్చాడు. ఈ పర్యాయం వాడు డబ్బేమీ పట్టుక వెళ్ళలేదు. మా నాన్న, అమ్మకు అదే చింత పట్టుకున్నది. 'ఎక్కడ వున్నాడో, ఎన్నెన్ని బాధలు పడుతున్నాడో నా బిడ్డ!' అని. ఉదయం వచ్చినప్పటినుంచి ఇద్దరూ ఒకటే గోల! వాళ్లు ఇంత

హుటాహుటిని విజయవాడ పరుగెత్తుక రావడంలో యిమిడి వున్న అసలు రహస్యమేమిటంటే మా వాడికి పెళ్ళి కుదిరింది. పాతికవేలు కట్నం! పెళ్ళి పేరు చెబితే పారిపోయే మగవాణ్ణి నేనెక్కడా చూడలేదు. ఇష్టంలేకపోతే చెప్పవచ్చునుగదా! అంతేగాని ఇంట్లో చెప్పా పెట్టకుండా దేశాలమీద బడిపోతే నలుగురూ నానా మాటలనరూ? ఇంతకూ వాణ్ణి అనే పనిలేదు. నాన్నా, అమ్మా వాణ్ణి నెత్తికెక్కించుకున్నారు. ఇరవయ్ ఏళ్లు వచ్చినా వాళ్ల దృష్టిలో వాడింకా పసివాడేనట! 'బిడ్డ చక్కిలం వలె ఎండిపోయాడంటే చక్కిలాలు ఇమ్మని ఏడ్చాడట! ఆ బాపతువాడు మావాడు.

ఉదయం అమ్మా, నాన్న వచ్చినప్పటినుంచి ఒకటే గొడవ - పత్రికలో 'కన్పించటంలేదు' అని మావాణ్ణి గురించి ప్రకటన ఇవ్వమని! ఎక్కడ నవ్విపోతారోనని నేను బాధ పడుతూవుంటే - 'నా బిడ్డ! నా బిడ్డ' అంటారు వాళ్లు కడగొట్టు బిడ్డంటే ఇంత ప్రేమ కాబోలు!

పోరుపడలేక - ఉదయం పదిగంటలకు పత్రికాఫీసుకెళ్లి 'కన్పించడంలేదు' అని ప్రకటన ఇచ్చాను. మావాడి ఆచూకీ తెలిపినవారికి, లేదా పట్టి తెచ్చినవారికి తగిన బహుమతి ఇవ్వబడుతుందనికూడా ఆ ప్రకటనలో ఇవ్వడం జరిగింది. మా నాన్న నూటపదహారు రూపాయలు బహుమతిగా లభిస్తాయని వేయమన్నాడుగాని, అదీ నాకిష్టం లేకపోయింది. అసలు ప్రకటన ఇవ్వడమే నాకు యిష్టంలేదు. వాడే తిరిగొస్తాడని ఎంత చెప్పినా వినలేదు. అవతల పిల్ల తరపువాళ్లు తొందర పడుతున్నారట! ఆ తరువాత ముహూర్తాలు లేవట!

మరొక విషయం చెప్పడం మరచాను: ప్రకటనతోపాటు ఫోటోకూడ అచ్చు వేయించమని ఇచ్చాను. నిజం చెప్పాలంటే ఆఫోటో మా తమ్ముడిదికాదు: అది నాఫోటో: అయితే మా ఉభయుల పోలికలు ఒకే రీతిగా వుంటాయి గనుక, ఆ ఐడియా మా నాన్నకు తట్టింది. నాదుంప తెంచుతారేమో: ఎందుకు నాన్నా నా ఫోటో ఇవ్వడమంటే వూరుకుంటేనా? 'ఆ ప్రకటన అలా యిచ్చి నీపని నీవు చూసుకో!' అని అన్నాడు నాన్న నన్ను పత్రికాఫీసుకు పంపిస్తూ.

కాని ఆ ప్రకటన యిచ్చాక ఆఫీసుకు వెళ్లడం నాకిష్టం లేకపోయింది. కొంపతీసి పత్రికలో ఫోటోచూసి జనం నావెంట బడితే ఏంగాను? ఆఫీసుకు శలవుబెట్టి, అక్కడా, ఇక్కడా కొంచెంసేపు కాలక్షేపంచేసి ఒంటిగంట ప్రాంతాన ఇంటికి తిరిగి వచ్చాను.

మానాన్న మూలమీద కూర్చున్నాడు. నన్ను చూడటంతోటే – 'ఎక్కడరా నారాయణరావు?' అన్నాడు. నేను వాణ్ణి జేబులో పెట్టుకొచ్చినట్టు! 'పత్రికలవాళ్లు ప్రకటనలు అచ్చువేయటం వరకేగాని, మనిషిని వెదికి మనకు అప్పగించరు! ఆపని పోలీసులు చేస్తారు. మరి పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వాలంటే – మనవాడిమీద నేరాలు ఆరోపించాలి – వాడు ఇంట్లో నుంచి ఏఐదువేల రూపాయలో కాజేసుకొని వెళ్ళాడని!'

మా నాన్నకు కోపం వచ్చింది.

'ఐదువేలు ఎందుకయిందిరా? వెయ్యి రూపాయలేగా?.. అయినా పోలీసు రిపోర్టు ఎందుకులే! పత్రికా ప్రకటన చాలు' అని అన్నాడు మానాన్న. మావాడు గ్రంధసాంగుడే. ఇంటర్‌లో

వాడు తెలుగులో రెండుసార్లు తప్పితే తెలుగు లెక్చరర్ దగ్గర ట్యూషన్ కుదర్చగా - మావాడు అసలు పాఠాలు వదిలేసి ఆయన కూతురువద్ద ప్రేమపాఠాలు నేర్చుకున్నాడు చెడి పోయాడు. పెళ్లి అనగానే పారిపోయాడు.

ఇంత జరిగినాకకూడా మానాన్నకు వాడిమీద రవ్వం తయినా ప్రేమ తగ్గలేదు. ఆ చేసేపెళ్ళి ఆ తెలుగు లెక్చరల్ కూతురితోనో చేస్తే పోయేదిగా...? ఊహుఁ... కట్నం కావాలి! పేరు ప్రతిష్టలు కావాలి! మాతాతల కాలాలనుంచి వస్తున్న పేరు ప్రతిష్టలు: మాతాతలు నేతులు తాగారు; మానాన్న వూళ్ళో పెత్తనం చెలాయించి, అడిగిన వాడికి నోటు పత్రం లేకుండా డబ్బిచ్చి, వాడికీ వీడికీ హామీవుండి వున్న ఆస్తిని కరిగింప జేసుకున్నాడు.

అమ్మ వుదయం వచ్చినప్పటినుంచి వాడిలోని విశేష ణాలు వల్లించటం మానలేదు! నేనూ ఒప్పుకుంటాను. వాడు చూడడానికి చాలా అందంగా వుంటాడు. మంచి భారీశరీరం! ముక్కూ, నోరూ అన్ని తీర్చిదిద్దినట్టు వుంటాయి. వీటినిబట్టి కాదుగా మనిషి విలువను కట్టేది? మనిషికి మంచితనం అనేది వుండాలి. మావాడిలో అది తప్ప తక్కిన సుగుణాలన్నీ వున్నాయి. ఊళ్లో కుఱ్రవాళ్ళ నందరినీ చేర్చి చెరువుగట్టుమీది గ్రంథాలయం వెనుక పేకాట ఆడుతాడు! ఐదుగంటల వేళ ఆగ్రంథాలయం ముందున్న అరుగుమీద కూర్చొని కన్పించిన వాళ్ళనందరినీ విమర్శించి వాళ్లతో పోట్లాట పెట్టుకుంటాడు. ఇక గుడివాడ వీధులలో వీడు నడవటంచూడాలి. ఆ ధీమా ఏమి చూసుకోనో, ఏమిటో మరి! ఎందుకో తెలియదుగాని -

చిన్నా, పెద్ద- ప్రతివాళ్ళూ మావాణ్ణిచూసి ఆప్యాయంగా పలకరిస్తారు. హైస్కూలు మాష్టర్లతోను, కాలేజీ లెక్చరర్లతోను- వీడు, సమాన వయస్కులతో మాట్లాడినట్టు మాట్లాడతాడు! హాస పరిహాసాలాడతాడు: స్కూళ్ళూ కాలేజీలు ఎలా నడుస్తున్నాయని ప్రశ్నిస్తాడు: వీడి నిష్క్రమణతోనే స్కూళ్ళు కాలేజీలు పనిచేయడం మానివేశాయని వీడి వుద్దేశ్యం కాబోలు.

వాడి నడత విషయంలో వేలెత్తి చూపడానికి వీల్లేదంటుంది, మా అమ్మ. కాని నాకుమాత్రం నమ్మకంలేదు వాడి మంచితనంమీద వచ్చిన చిక్కేమిటంటే నేను వాడి బాగోగులనుగురించి ఎంత విచారిస్తానో, మానాన్నకు, అమ్మకు వాడి మీద అంతనమ్మకం. వాడివంటిమీద ఈగవాలడానికి వీల్లేదు.

అయితే వాడు పొరపాటునకూడా సిగరెట్టుతాగడు. అదే మావాడిలోవున్న విశేషమల్లా! దీనికొక చిన్నకథ వున్నది. ఆకథను ఆసాంతంగా చెప్పి ఈ ప్రకటనను పెంచడం నాకిష్టంలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ తెలుగులెక్చరర్ కూతురు మావాడిని సిగరెట్లు తాగడం మాన్పించేసింది. లేకపోతే వాడు నామాటా మీమాటా వింటాడా? అంతే మరి గురికుదురుతే - మగవాడు ఆడది ఏంచెప్పినా చేస్తాడు; అందులో మా తమ్ముడిలాంటి వాళ్ళు చూసిరమ్మంటే కాల్చి వస్తారు.

ఇదీ విషయం: ఇకపోతే తెలుగు లెక్చరర్ కూతుర్ని గురించి వివరాలు ప్రకటించి, ఆయనకు, ఆయన కూతురికీ అన్యాయం చేయదలచుకోలేదు.

ఈ ప్రకటన చూసిన వారెవ్వరైనా సరే- మావాడి ఆచూకి తెలియజేసినా, లేదా పట్టియిచ్చినా వారికి తగిన బహుమతి లభిస్తుంది. మానాన్న నూటపదహార్లు ఇస్తామంటు న్నాడుగాని, నాలుగు కబుర్లు చెబితే ఆయన ఇట్టె ఉబ్బిపోయే మనిషి... మరొక పదో, పాతికో లభించవచ్చును కూడా! ఆ మొహమాటం అక్కర్లేదు.

విజయవాడలో సూర్యారావుపేట చివరన మొగల్రాజ పురం వెళ్ళే రోడ్డుమీద, బారిష్టరుగారి మేడకు ఎదురుగావున్న సందుపక్క మలుపుమీదవున్న అరుగుమీద ఖద్దరుబట్టలు ధరించిన బట్టతల ముసలాయన ఒకాయన చుట్టకాల్చుకుంటూ కూర్చొని వుంటాడు ఉదయంనుంచి సాయంత్రందాకా! ఆయన జేబులో దాదాపు రెండువందల రూపాయలు ఉంటాయి. చేతిలో ఆరోజు దినపత్రిక వుంటుంది. వచ్చేపోయే మనుషుల వైపు ఆశగా చూస్తూవుంటాడు. అక్కడకొచ్చి ఎవరైనా నిలబడితే చాలు- 'ఏవూరు బాబూ మనది?' అని సవాలక్ష ప్రశ్నలు వేసి విసిగిస్తాడు. ఆవేసే ప్రశ్నలుకూడా చుట్టతాగుతూ, ఏదో ముక్తాయింపుగా వుంటాయి. ఆయన 'ఆఁ' అనడాకి కూడా అరనిమిషం పడుతుంది. ఆయనే మానాన్న! ఎవ రైనాసరే వచ్చి ఆయనను అక్కడ కలుసుకొని మావాడి ఆచూకి తెలిస్తే చెప్పవచ్చును. లేదా ఆకారానికి సంబం ధించిన వివరాలు కావలసివుంటే ఆయనను వాకబు చేయ వచ్చును.

ఒరేయ్ నారాయణా! (ఈ ప్రకటన ఒకవేళ మావాడి కంటబడుతుందనే నమ్మకంతో వాణ్ణి సంబోధిస్తున్నాను.)

ఏమిటిరా ఈ పనులు? నలుగురికి తెలిస్తే మనగౌరవము మంట కలసి పోదట్రా! ఆ పిల్లను పెళ్ళిచేసుకుండానంటే నాన్న అడ్డు పెట్టేవాటటరా?... అసలు నీవీ పాడుపనికి ఎందుకు పూను కున్నావంట? సరే అయిపోయిం దేదో అయిపోయింది. తిరిగి వచ్చివెయ్! నీకు నచ్చిన పిల్లనే పెళ్ళిచేసుకో. నాన్నా, అమ్మా నీమీద బెంగపెట్టుకొని వున్నారు. (కాని అబద్ధం! అమ్మ నిన్న సాయంత్రం సినిమాకు వెళ్ళింది. నాన్న బారిష్టరు గారింటి కెళ్ళి కబుర్లు చెబుతు కాలక్షేపం చేస్తున్నాడు.) వస్తావు కదూ తక్షణం!

ఇట్లు నీ అన్న "మధు."